క్లుప్తంగా

చౌళూరులో కార్డెన్ సెర్చ్



కార్డెన్ సెర్చ్‌లో పాల్గొన్న పోలీసులు

హిందూపురం: గ్రామాల్లో శాంతిభద్రలు పరిరక్షించడంతో పాటు అసాంఘిక కార్యకలాపాలను నియంత్రించడానికి గ్రామ పంచాయతీ కేంద్రాలు, సమస్యాత్మక గ్రామాల్లో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నారు. హిందూపురం మండలంలోని చౌళూరు గ్రామంలో రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం కార్డెన్ సెర్చ్ చేపట్టారు. రికార్డులు లేని రెండు ద్విచక్ర వాహనాలు సీజ్ చేశారు. అలాగే అనుమానితుల ఇళ్లలో పరిశీలించి రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో హిందూపురం సబ్ డివిజన్ సీఐలు రాజగోపాల్, జనార్దన్, అబ్దుల్ కరీం, పోలీస్ సిబ్బంది, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

టీడీపీది కపట నాటకం

పెనుకొండ: 'వక్ఫ్ బిల్లుకు అనుకూలంగా ఓటు వేయించడంతో ముఖ్యమంత్రి చంద్రబాబుకు మైనార్టీలపై ఉన్న ప్రేమ అర్థమవుతోంది. మైనార్టీలపై టీడీపీది కపట నాటకమని మరోసారి రుజువు అయింది' అని పెనుకొండ నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్ విమర్శించారు. శుక్రవారం ఆయన సాక్షితో మాట్లాడారు. సీఎం చంద్రబాబు కుట్రలను రాష్ట్ర మైనార్టీలు గమనించాలన్నారు. భవిష్యత్తులో దేశంలో శాంతి సామరస్యానికి విఘాతం కల్గించే ఇలాంటి బిల్లును కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు.

ప్రెస్‌క్లబ్ నిర్మాణానికి రూ.79 వేల విరాళం



కమిటీ సభ్యులకు విరాళం అందిస్తున్న ఉపాధ్యాయులు

లేపాక్షి: మండల కేంద్రమైన లేపాక్షి పంచాయతీ కార్యాలయం ఆవరణంలో నూతనంగా నిర్మిస్తున్న లేపాక్షి దుర్గాదేవి ప్రెస్‌క్లబ్ నిర్మాణానికి దాతలు రూ.79 వేలు అందించారు. శుక్రవారం మధ్యాహ్నం ప్రెస్‌క్లబ్ కమిటీ సభ్యులకు ఆ మొత్తాన్ని అందజేశారు. లేపాక్షి మండల ఉపాధ్యాయుల బృందం రూ.58 వేలు, ఎంఈఓ -1 నాగరాజు రూ.10,116, మండలంలోని పి.సడ్లపల్లి గ్రామానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆంజనేయరెడ్డి రూ. 10 వేలు విరాళాలను అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు ప్రెస్‌క్లబ్ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు పరామర్శ



వంశీని పరామర్శిస్తున్న వేణురెడ్డి

చిలమత్తూరు: హిందూపురం పట్టణంలోని ముద్దిరెడ్డిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త వంశీ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నేత వేణురెడ్డి శుక్రవారం ఆస్పత్రికెళ్లి వంశీని పరామర్శించి ధైర్యం చెప్పారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు.

తేనెటీగల దాడి

రొళ్ల: తేనెటీగల దాడిలో వ్యక్తి అస్వస్థతకు గురైన సంఘటన శుక్రవారం టీడీ పల్లిలో చోటు చేసుకుంది. టీడీ పల్లికి చెందిన మారేగౌడ్ పొలంలో వరి పంటకు నీళ్లు కట్టేందుకు శుక్రవారం వెళ్లారు. అయితే కోతులు చెట్లపై నుంచి దూకుతున్న సమయంలో కొబ్బరి చెట్లకు ఉన్న తేనెటీగలు ఒక్కసారిగా లేచాయి. అక్కడే నీళ్లు కడుతున్న మారేగౌడుపై దాడి చేశాయి. మారేగౌడు కుప్పకూలగా.. పక్కనే పొలంలో ఉన్న తన అల్లుడు ఆనంద్ కనుక్కొని వెంటనే మారేగౌడును హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పి.సడ్లపల్లిలో పోలీసుల 'పల్లె నిద్ర'



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ మహేష్

లేపాక్షి: మండలంలోని పులమతి పంచాయతీ పరిధిలోని పి.సడ్లపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి హిందూపురం డీఎస్పీ మహేష్‌తో పాటు హిందూపురం రూరల్ సీఐ జనార్దన్, స్థానిక ఎస్ఐ నరేంద్ర ఆధ్వర్యంలో పోలీసులు పల్లె నిద్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రజలతో పలు విషయాలపై అవగాహన కల్పించారు.

నవమి శోభ



శ్రీరామనవమి హిందువులకు ముఖ్యమైన పండుగ. శ్రీరాముని జన్మదినోత్సవంగా మాత్రమే కాదు, సీతారాముల కల్యాణం, శ్రీరామ పట్టాభిషేకం కూడా అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా సీతారాముల ఆలయాలతో పాటు ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. స్వామివార్ల విగ్రహాలతో ఊరేగింపు, ఉట్ల పరుషలకు సన్నాహాలు చేస్తున్నారు.

- రేపు శ్రీరామ నవమి వేడుకలు
- రాముడు, ఆంజనేయస్వామి ఆలయాల ముస్తాబు
- కల్యాణోత్సవాలు, ఊరేగింపు, ఉట్ల పరుషల నిర్వహణకు ఏర్పాట్లు

హిందూపురం: సూగురు ఆంజనేయస్వామి ఆలయం శ్రీరామ నవమి వేడుకలకు ముస్తాబైంది. 5న చైత్ర శుద్ధ అష్టమి తెల్లవారుజామున మూలవిరాట్ సూగురు ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకాలు, విశేష అలంకరణ, ఆకుపూజలతో మంగళ హరతులతో పూజలు జరుగుతాయి. అనంతరం ప్రాకారోత్సవం, 11 గంటలకు అంకురార్పణ, ధ్వజారోహణ కార్యక్రమం ఉంటుంది. 6న శ్రీరామ నవమి పండుగ సందర్భంగా తెల్లవారుజామున విశేష పంచామృతాభిషేకాలు, ఆకుపూజ, ప్రాకారోత్సవం, 10 గంటలకు సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తారు. అలాగే మధ్యాహ్నం 12 గంటలకు రథంలో సీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి ఉత్సవమూర్తులను కొలువుదీర్చి రథోత్సవం నిర్వహిస్తారు. అనంతరం సాయంత్రం 4 గంటలకు యువత కేరింతల మధ్య ఉట్ల పరుష ఉత్సాహంగా సాగనుంది. సాయంత్రం 6 గంటలకు అశేషజన సందోహం మధ్య లంకాదహనం కార్యక్రమం నిర్వహించనున్నారు. 7వ తేదీ ఉదయం అభిషేక పూజలు, ప్రాకారోత్సవంతో పాటు వసంతోత్సవం జరిపిస్తారు. అలాగే సీతారాముల పట్టాభిషేకం కార్యక్రమం ఉంటుంది. సాయంత్రం సీతారాములను అశ్వవాహనంపై కొలువుదీర్చి నగరోత్సవం చేస్తారు. అనంతరం రాత్రి 10 గంటలకు స్వామివారి శయనోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి.

నవమి వేడుకలకు ఏర్పాట్లు

ప్రతి ఏడు శ్రీరామ నవమి వేడుకలు ఆలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగానే ఈనెల 6న శ్రీరామ నవమి వేడుకలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. పెనుకొండ ప్రజలే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు, ప్రజలు పెద్ద వేడుకలకు తరలిరానున్నారు. మొదటి అర్చకులైన దివంగత రామ కృష్ణ 68 ఏళ్ల క్రితం ఆలయం ఆవరణలో ఉట్ల పరుష, అన్నదానం ప్రారంభించారని, నాటి నుండి నేటి వరుకూ ప్రతి ఏటా ఆ కార్యక్రమాలు జరుగుతున్నాయని ఆలయ అర్చకులు ప్రభాకర్ స్వామి తెలిపారు. ఆదివారం ఉదయం 5 గంటల అభిషేకం, అర్చనలు, ఆకుపూజ నిర్వహిస్తారు. 10 గంటలకు శ్రీరామ తారక హోమం, పూర్ణాహుతి, 12 గంటలకు అభిజిత్ లగ్నంలో సీతారాముల కల్యాణం. 4 గంటల నుంచి ఉట్ల పరుష కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

మడకశిరరూరల్: మడకశిర మండలం నీలకంఠాపురం గ్రామంలోని నీలకంఠేశ్వరస్వామి సముదాయ దేవాలయంలో ప్రతి ఏడాది శ్రీరామ నవమి ఉత్సవాలు మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. 6న శ్రీరామ నవమి వేడుకలు, సీతారాముల ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహిస్తారు. సోమవారం సీతారాముల కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. అదే రోజు ఉదయం ఆలయ కమిటీ చైర్మన్ రఘువీర కుటుంబ సభ్యులచే ఉచిత సాముహిక వివాహాలు జరుగుతాయి. మంగళవారం గోవిందాపురం, జీవీ పాళ్యం పంచాయతీలోని దేవాలయాల నుంచి తీసుకొచ్చిన కలశాలతో యాగశాల ఆవాహనం, పూజ, పూర్ణహుతి, జ్యోతుల ఉత్సవం, ఉట్ల పరుష, ధూళి ఉత్సవంతో పాటు బ్రహ్మ రథోత్సవం నిర్వహిస్తారు. ముఖ్యంగా సీతారాముల కల్యాణోత్సవాన్ని తిలకించడానికి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలతో పాటు కర్ణాటక నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరానున్నారు.



సూగురు ఆంజనేయస్వామి దేవస్థానం



మడకశిర: సీతారాముల మూల విరాట్

ఆలయ చరిత్ర ఇలా..

సూగురు ఆంజనేయస్వామి దర్శనంతో సర్వకార్యసిద్ధితో పాటు జయం వరిస్తుందని భక్తుల నమ్మకం. 14వ శతాబ్దంలో విజయనగర రాజుల గురువు వ్యాస రాయలు ఆంజనేయుని విగ్రహం ప్రతిష్ఠించినట్లు ప్రతీతి. నాడు విపత్కర పరిస్థితులను తొలగించడానికి మూలవిరాట్ ఆంజనేయ విగ్రహాన్ని గధ, శంఖు, చక్రం కల్గిన మూర్తిని ప్రతిష్ఠించారట. ఆ తర్వాత కాలనుగుణంగా కనుమరుగై 1923లో సూరయ్యశెట్టికి స్వప్నంలో ఆంజనేయస్వామి కనిపించి వేపచెట్టు కింద ఉన్న పుట్టలో కొలువుతీరినట్లు చెప్పారట. అలా పుట్టనుంచి ఉద్భవించిన ఆంజనేయస్వామి విగ్రహాన్ని పునః ప్రతిష్ఠించి చుట్టుపక్కల గల 11 ఎకరాల భూమిని కొనుగోలు చేసిన సూరయ్యశెట్టి కుటుంబీకులు ఆలయానికి దానం చేశారని చెబుతున్నారు. అప్పటి సూగురు ఆంజనేయుడిగా భక్తుల కొంగుబంగారంగా నిలిచి కోరిన కొర్కెలు తీర్చే మహిమన్విత ఆంజనేయుడిగా స్వామివారు పూజలు అందుకుంటున్నారు.



సూగురు ఆంజనేయస్వామి మూల విరాట్

మహిమాన్వితుడు పెద్ద చెరువుకట్ట ఆంజనేయుడు



పెనుకొండ: పెద్ద చెరువుకట్ట ఆంజనేయ స్వామి మూల విరాట్

పెనుకొండ రూరల్: మండల పరిధిలోని పెద్ద చెరువుకట్ట ఆంజనేయస్వామి మహిమాన్వితుడిగా విరాజిల్లుతున్నారు. కోరిన కోర్కెలు తీర్చే దైవంగా పూజలు అందుకుంటున్నారు. 44వ నంబర్ పాత జాతీయ రహదారి గుండా దూర ప్రాంతాలకు ప్రయాణించే, ప్రతి వాహన దారుడు క్షేమంగా గమ్యం చేరేందుకు స్వామి వారిని దర్శించుకొని పూజలు చేస్తుంటారు. శ్రీకృష్ణదేవరాయల గురువు వ్యాస రాయలు పెద్ద చెరువు కట్ట ఆంజనేయస్వామిని ప్రతిష్ఠించినట్లు చరిత్ర చెబుతోంది.

ఘనంగా సరస్వతీ పూజ



సరస్వతీ పూజలో పాల్గొన్న విద్యార్థులు

గోరంట్ల: మండల పరిధిలోని కోరేవాండ్లపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం స్కూల్ డే ను అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతీ పూజను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హిందూపురం: మండలంలోని చిన్నగుడ్డంపల్లిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం సరస్వతీ పూజ ఘనంగా జరుపుకున్నారు. అనంతరం స్కూల్ పూర్వ హెచ్ఎం నాగమణిని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

సీసీ రోడ్డును ప్రారంభించిన మంత్రి



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి సవిత

పెనుకొండ రూరల్: మండలంలోని నాగళూరులో జలజీవన్ మిషన్‌లో భాగంగా నీటి ఎద్దడి తీర్చేందుకు నూతనంగా బోరు వేసేందుకు శుక్రవారం నిర్వహించిన పూజా కార్యక్రమంలో మంత్రి సవిత పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో రూ.1.5 కోట్లతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు.

రొద్దం: మండల కేంద్రంలో ఎంజేపీ గురుకుల బాలుర పాఠశాల నిర్మాణ పనులను శుక్రవారం మంత్రి ఎస్ సవిత పరిశీలించారు. పనులు వేగంగా చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. రూ 17 కోట్లతో నూతన పాఠశాల భవనాలను నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం తురకలాపట్నం చెరువుకు జలహారతి ఇచ్చారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై గ్రామస్తులు మంత్రికి వినతిపత్రమిచ్చారు.

'అందరి సమక్షంలో హుండీ కానుకల లెక్కింపు'

సాక్షి ఎఫెక్ట్..



హుండీ కానుకను లెక్కిస్తున్న దృశ్యం

రొళ్ల: స్థానిక లక్ష్మీనరసింహ స్వామి ఆలయం ప్రాంగణంలో శుక్రవారం భక్తులు కానుక రూపంలో హుండీ ఆదాయాన్ని కైవాడస్తులు, గ్రామ పెద్దలు, భక్తుల సమక్షంలో లెక్కింపు చేపట్టారు. శుక్రవారం సాక్షి పత్రికల్లో 'అందరి సమక్షంలో హుండీ కానుకలు లెక్కించాలి' అనే శీర్షిక కథనం వెలువడటంతో గ్రామ పెద్దలు స్పందించారు. ఈ ఏడాది మార్చి 12 నుంచి 21వ తేదీ వరకూ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఆలయ ప్రాంగణంలో హుండీలో వేసిన కానుక రూపంలో వేసిన ఆదాయాన్ని లెక్కించారు. అయితే ముందుగా నోట్లను లెక్కించడం మొదలు పెట్టారు. తర్వాత నాణేలను లెక్కించడానికి సమయం మించి పోవడంతో శనివారానికి లెక్కింపు ప్రక్రియను వాయిదా వేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

టీడీపీ కరపత్రంలా ఉత్సవ ఆహ్వాన పత్రిక



టీడీపీ నేతల పేర్లతో నిండిపోయిన రాములోరి ఉత్సవాల ఆహ్వాన పత్రిక

చిలమత్తూరు: దేవుడి కార్యక్రమాల్లో సైతం టీడీపీ నేతలు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. కోడూరు రాములవారి ఉత్సవాల్లో ఆహ్వాన పత్రికలో కనీసం ప్రోటోకాల్ సైతం పాటించకుండా వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులను అవమానించడమే లక్ష్యంగా టీడీపీ నేతల పేర్లు మాత్రమే ముద్రించడం విమర్శలకు తావిస్తోంది. టీడీపీలో చోటా మోటా లీడర్ల పేర్లు ముద్రించగా.. ఎంపీపీ మొదలు మండల కన్వీనర్ ఇతర ముఖ్య నేతల పేర్లు మాత్రం లేకపోవడంతో అది టీడీపీ నేతల కరపత్రమంటూ స్థానికులు పెదవి విరుస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇలాంటి చర్యలు అసలు చూడలేదని, టీడీపీ నేతలు నిరంకుశత్వంగా వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు. ఎంపీపీని అవమానించే విధంగా కేవలం ఎంపీపీ చిలమత్తూరు అని మాత్రమే ముద్రించడం సరికాదని, ఇప్పటికైనా ఇలాంటి చర్యలు మానుకోవాలని హితవు పలుకుతున్నారు.

సంక్షిప్త సమాచారం

ఇంటర్ తరగతులు ప్రారంభం

పెనుకొండ: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఇంటర్ సీనియర్ తరగతులు ప్రారంభమైనట్లు ప్రిన్సిపల్ సుదర్శన్ తెలిపారు. ఉదయం 9 గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకూ తరగులు జరుగుతాయన్నారు. మొదటి సంవత్సరం అడ్మిషన్లు ఈ నెల 7వ తేదీ నుంచి ప్రారంభమవుతాయన్నారు.

లైనింగ్ పనులు ఆపండి

పెనుకొండ: హంద్రీనీవా లైనింగ్ పనులు ఆపాలని ఏపీ రైతు సంఘం, సీఐటీయూ నాయకులు మంత్రి సవితకు పట్టణంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. వెంటనే ప్రభుత్వం 404, 405 జీవోలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు నాయకులు హరి, జంగాలపల్లి, పెద్దన్న బాబావలి, గంగాధర్, ఫక్రోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

6 నుంచి మారెమ్మ జాతర

అగళి: మండల పరిధిలోని ఉల్లేకెర గ్రామంలో వెలసిన మారెమ్మ జాతరను ఈ నెల 6, 7, 8 తేదీల్లో నిర్వహిసున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

చలివేంద్రాల ఏర్పాటు

హిందూపురం: సద్గురు యోగి నారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో మూడు చోట్ల చలివేంద్రాలు ప్రారంభించారు. మున్సిపల్ ఆఫీసు, పట్టుగూళ్లమార్కెట్, రైల్వేరోడ్డు మూడుచోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రమేష్‌కుమార్, పట్టుగూళ్ల మార్కెట్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో సర్పంచ్ భర్త మృతి

రొద్దం: మండల పరిధిలోని కలిపి సర్పంచ్ కదిరమ్మ భర్త సిద్ధప్ప (80) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు.. సిద్ధప్ప మృతదేహం వద్ద నివాళులర్పించి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

భూసార పరీక్షలతో అధిక దిగుబడి

పెనుకొండ: భూసార పరీక్షలతో పంట తోటల్లో అధిక దిగుబడులు పొందవచ్చని డిజిటల్ గ్రీన్‌శాఖ అధికారి శ్రీకాంత్ పేర్కొన్నారు. పట్టణంలోని హార్టీకల్చర్ కార్యాలయంలో శుక్రవారం రైతులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. శ్రీకాంత్ మాట్లాడుతూ భూసారం ఆధారంగా పంటలు వేసి మందులు వాడాలన్నారు.

మేట్ల సమస్యలు పరిష్కరించండి

సోమందేపల్లి: ఉపాధి పథకంలో పనిచేసే మేట్ల సమస్యల పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సాయిబాబా ఆలయం వద్ద సమావేశం నిర్వహించారు. కూలీలకు రెండు నెలలు దాటినా వేతనాలు ఇవ్వక పోవడం దారుణమన్నారు.

నూతన కమిటీ ఎంపిక

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని కాలమ్మ ఆలయం వద్ద శుక్రవారం యాదవ సంఘం నూతన కమిటీ ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా మహేష్, ఉపాధ్యక్షుడిగా అమర్నాథ్, ప్రధాన కార్యదర్శిగా గోపాల్, కోశాధికారిగా నరసింహమూర్తి, ప్రచార కార్యదర్శిగా రమేష్‌తో పాటు ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

ధ్రువీకరణ పత్రాల తనిఖీ

పెనుకొండ: పట్టణంలోని ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో శుక్రవారం వైద్యాధికారి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో వికలాంగుల ధ్రువీకరణ పత్రాలను తనిఖీ చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వికలాంగుల ధ్రువీకరణ పత్రాలు, వారి ఆరోగ్య పరిస్థితిన వైద్యాధికారి పరిశీలించి నమోదు చేశారు.

భూసేకరణ ఆపాలని నిరసన

మడకశిర: మండల పరిధిలోని గౌడనహళ్లి పంచాయతీలో పరిశ్రమలు, సోలార్ కోసం రెండో విడత చేస్తున్న భూసేకరణను ఆపాలని కోరుతూ శుక్రవారం రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు హరి, కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ గౌడనహళ్లి పంచాయతీలో రైతులు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారని, సోలార్ పార్కు కోసం రెండో విడత భూ సేకరణ చేయకూడదన్నారు. గతంలో పరిశ్రమల ఏర్పాటుకు భూసేకరణ చేసినా ఇప్పటి వరకూ ఎలాంటి పరిశ్రమలు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయలేదన్నారు. అనంతరం తహసీల్దార్ కరుణాకర్‌కు వినతిపత్రమిచ్చారు.

ముగిసిన వేలం పాట

రొళ్ల: స్థానిక సచివాలయం-1 ఆవరణలో శుక్రవారం 2025-26 సంవత్సరానికిగాను వారపు సంత మార్కెట్, బస్టాండ్ ఆవరణలో సుంకం వసూలు కోసం బహిరంగ వేలాన్ని సర్పంచ్ రామలక్ష్మమ్మ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించినట్లు ఇన్‌చార్జ్ ఈఓఆర్డీ బాబురావు తెలిపారు. బస్టాండ్ సుంకం వసూలును శేఖర్ అనే వ్యక్తి రూ.82 వేలకు, వారపు సంతమార్కెట్ సుంకం వసూలు కోసం పూజారి నాగరాజు రూ.61 వేలకు దక్కించుకున్నారు.

కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు

గోరంట్ల: స్థానిక గిరిజన సంక్షేమ పాఠశాలలో శుక్రవారం గిరిజన సంక్షేమశాఖ, ఐడీబీఐ బ్యాంక్ శాఖ ధర్మవరం ఆధ్వర్యంలో కంప్యూటర్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. ల్యాబ్‌ను శుక్రవారం జిల్లా ట్రైబెల్ వేల్ఫేర్ అధికారి మోహన్‌రావు ప్రారంభించారు. కంప్యూటర్ ల్యాబ్ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.



ఉష్ణోగ్రత సమాచారం

హిందుపురం	32.0
పెనుకొండ	34 .0
మడకశిర	32.0

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మడకశిరరూరల్: మండల వ్యాప్తంగా శనివారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ రఘు శుక్రవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. 220 కేవీ పంపనూరు తండా నుంచి 400 కేవీ హిందూపురం టీఎండీసీకి కొత్త విద్యుత్ లైన్ లాగుతున్నారని పేర్కొన్నారు. మడకశిర 132 కేవీ విద్యుత్ లైన్ క్లియర్ (ఎల్‌సీ) తీసుకుంటున్నట్లు తెలిపారు. దీంతో మడకశిర, ఆర్ అనంతపురం, కల్లుమర్రి, వైబీహళ్లి, నీలకంఠాపురం, కదిరేపల్లి విద్యుత్ ఉప కేంద్రాల పరిధిలోని వ్యవసాయానికి సంబంధించి విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. కావున విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

వస్త్ర దుకాణంలో చోరీ



దొంగతనం జరిగిన దుకాణం

అమరాపురం: స్థానిక మెయిన్ బజార్‌లోని శ్రీదేవి దుస్తుల దుకాణంలో గురువారం రాత్రి దొంగతనం జరిగింది. దొంగలు రాత్రి షాపులోకి చొరబడి క్యాష్ కౌంటర్‌లోని రూ.1.5 లక్షలు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు శక్తిప్రసాద్ తెలిపారు. అలాగే కాంతరాజుకు చెందిన బంగారు దుకాణంలో చోరీకి యత్నించారు. షట్టర్‌పైకి తీసి షాపులోకి వెళ్లినా వస్తువులు తీసుకోవడానికి వీలుకాకపోవడంతో పరారయ్యారు.

ఆక్రమణల తొలగింపునకు యత్నం



ఆక్రమణల తొలగింపునకు యత్నిస్తున్న మున్సిపల్ అధికారులు

హిందూపురం టౌన్: పట్టణంలోని నంది సర్కిల్‌లో ఉన్న ఆక్రమణలను మున్సిపల్ అధికారులు శుక్రవారం తొలగించడానికి యత్నించారు. తమకు ప్రత్యామ్నాయం చూపాలని స్థానికులు అధికారులను నిలదీశారు. దీంతో స్థానికులు, మున్సిపల్ అధికారుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. వ్యవసాయ మార్కెట్ యార్డ్ హమాలి సంఘం నాయకులు, ఇతర యూనియన్ నాయకులు తొలంపును అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న వ్యవసాయ మార్కెట్ యార్డ్ హమాలి సంఘం గౌరవాధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు కొండూరు వేణుగోపాల్‌రెడ్డి అక్కడికి చేరుకుని వారికి మద్దతుగా నిలిచారు. చిన్న వ్యాపారులు బంకులు ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తుంటే ఆక్రమణల పేరుతో తొలగించడం అన్యాయం అన్నారు. చివరకు ఈ విషయంలో తామే కార్యాలయానికి వచ్చి చర్చిస్తామని చెప్పడంతో మున్సిపల్ అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.